క్లుప్తంగా

రేషన్ కార్డుల పంపిణీ



నర్సంపేట : పట్టణంలోని పలువురికి మాజీ కౌన్సిలర్ ఓర్సు అంజలి అశోక్ శనివారం నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్కరికి కూడా రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. పట్టణంలోని 14వ వార్డులో మాజీ కౌన్సిలర్ ఎలమకంటి విజయ్‌కుమార్, 1వ డివిజన్‌లో ఇన్‌చార్జ్ లక్కర్సు రమేశ్ లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేశారు.

ప్రాంగణ నియామకాలు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్స్ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన క్లైమిస్పిక్ రిసెర్చ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ శనివారం ప్రాంగణ నియామకాలు చేపట్టింది. 2024-25 విద్యాసంవత్సరంలో ఫార్మసీ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. సుమారు 100 మంది విద్యార్థులు హాజరు కాగా 15 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు సంస్థ జనరల్ మేనేజర్ సదానందం తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, ట్రెయినింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ అధికారి మనీశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా రత్నం



నల్లబెల్లి : ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన పరికి రత్నం ఎన్నికయ్యారు. ఈ మేరకు సీనియర్ నాయకుడు కోర్నెల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో రత్నం విలేకరులతో మాట్లాడారు. దళితుల సమస్యలపై పోరాడతామని చెప్పారు. సంఘాన్ని మండలంలో బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య



ద్వాలి (ఫైల్)

సంగెం : ఉరేసుకుని వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని బాలునాయక్ తండా శివారు గుట్టకిందితండాకు చెందిన లకావత్ షక్రు–ద్వాలి దంపతులకు ఐదుగురు పిల్లలున్నారు. అందరి వివాహాలు అయ్యాయి. షక్రు కొంత కాలం క్రితం మృతి చెందాడు. ఒంటరిగా ఉంటున్న ద్వాలి (79) శుక్రవారం రాత్రి ఉరేసుకుంది. ఆమె ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని ఆమె మనుమడు నాగరాజు గమనించడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. మృతురాలి కూతురు వాంకుడోత్ నీలావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

విద్యుదాఘాతంతో మేకలు మృతి

పర్వతగిరి : విద్యుదాఘాతంతో మూడు సూడి మేకలు మృతి చెందిన ఘటన మండలంలోని చౌటపల్లిలో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా.. గుర్రం యాదగిరి, సుల్తాన్ కుమారస్వామికి చెందిన మేకలు మేతకు వెళ్లిన క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. మరో రెండు, మూడ్రోజుల్లో ఈననున్న మేకలు మృతి చెందడంతో తాము భారీగా నష్టపోయామని బాధితులు వాపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

అక్రమంగా భారీ వృక్షాల తొలగింపు

పర్వతగిరి : మండల కేంద్రంలోని సర్వే నంబర్ 897ఏ/5 పరిధిలోని పెద్ద చెరువు రిజర్వాయర్ సమీపంలోని గుండ్లకుంట ప్రధాన రహదారి వెంట ఉన్న వందేళ్ల కిందటి భారీ వృక్షాలను (మర్రి చెట్లు) మండలంలోని తురుకల సోమారం గ్రామానికి చెందిన కట్టెల వ్యాపారి రాపాక వెంకన్న అక్రమంగా తొలగించినట్లు తెలుస్తోంది. సుమారు 15 చెట్లను ప్రభుత్వ అనుమతి లేకుండా తొలగించినా వెంకన్నపై అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రోడ్డు సమస్య పరిష్కరించాలని వినతి

సంగెం : మండలంలోని బీకోజీనాయక్ తండా నుంచి బాలునాయక్ తండాకు వెళ్లే రోడ్డు సమస్య పరిష్కరించాలని కోరుతూ బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ సపావట్ మహేందర్ నాయక్ కలెక్టర్ కార్యాలయ అధికారికి శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మహేందర్ మాట్లాడారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నదని చెప్పారు. ప్రజలు, రైతులు రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొందని తెలిపారు. వెంటనే రోడ్డు నిర్మింపజేసి సమస్య పరిష్కరించాలని కోరారు.

కౌలు రైతుకు సహకారం కరువు

ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి మండలంలోని రేకంపల్లికి చెందిన **కౌలు రైతు మట్టివాడ చింటు.** ఈయన నాలుగేళ్లుగా గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద 8 ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. మొదట కౌలు ఎకరాకు రూ.10 వేలు ఉండగా ప్రస్తుతం రూ.20 వేలకు పెరిగిందని చెప్పాడు. ఎరువుల ధరలు మిన్నంటగా భూమి కౌలుకు తీసుకుని పంట సాగు చేస్తే లాభం రాకపోగా పెట్టుబడి కూడా గిట్టుబాటు కావడం లేదని వాపోయాడు. ప్రభుత్వం కౌలు రైతులకు కూడా రైతు భరోసా, రైతు బీమా వర్తింపజేయాలని కోరుతున్నాడు. ఇది రైతులందరి దుస్థితి..





నాగలి దున్నుతూ విత్తనాలు చల్లుతున్న కౌలు రైతులు (ఫైల్)

● పథకాలు వర్తించని దుస్థితి

దుగ్గొండి : గ్రామీణ ప్రాంత వ్యవసాయ కూలీలు జీవనోపాధి కోసం రైతుల వద్ద భూమి కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నారు. కౌలు రైతులకు అధికారికంగా గుర్తింపు లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వర్తించడం లేదన్నది జగమెరిగిన సత్యం. బ్యాంకులు రుణాలివ్వని పరిస్థితుల్లో పెట్టుబడి కోసం ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించక తప్పడం లేదు. పంట నష్టం వాటిల్లితే పరిహారం సైతం రాదు. ఈ క్రమంలో కౌలు రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు.

మండలంలో 478 మంది..

మండలవ్యాప్తంగా 34 గ్రామ పంచాయతీల పరిధిలో 478 మంది కౌలు రైతులు 1176 ఎకరాల వ్యవసాయ భూమి కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. భూమిని బట్టి ఎకరాకు రూ.10-25 వేల వరకు కౌలు చెల్లిస్తున్నారు. గత ప్రభుత్వం కౌలు రైతు గుర్తింపు కార్డులు ఇచ్చిన విషయం తెలిసిందే. నిబంధనల ప్రకారం రుణకార్డులు అందించి బ్యాంకుల నుంచి రుణాలిప్పిస్తామన్నది నాటి బీఆర్ఎస్ ప్రభుత్వ హామీ. ఆ ప్రభుత్వం అధికారం కోల్పోగా సదరు హామీ అటకెక్కింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కౌలు రైతులను గుర్తిస్తామని, రైతుభరోసా, రైతుబీమా వర్తింపజేస్తామని హామీ ఇచ్చింది. అధికారం చేపట్టి 20 నెలలు గడిచినా హామీలు నెరవేర్చడం లేదన్న అపవాదు ఉంది.

పథకాలు వర్తింపజేయాలి



ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతులకు రైతుభరోసా, రైతుబీమా, ఇతర పథకాలు వర్తింపజేయాలి. నాకు వ్యవసాయ భూమి లేదు. పక్కనే ఉన్న రేబల్లెలో ఓ రైతు వద్ద 5 ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నా. బ్యాంకు నుంచి రుణం ఇవ్వలేదు. పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారస్తుల వద్ద అప్పు తీసుకున్నా. పంట దిగుబడి రాకపోవడంతో నష్టం వాటిల్లింది. ప్రభుత్వం రైతుభరోసా ఇచ్చి ఉంటే కొంతైనా మేలు జరిగేది.

– బుస్సారి రాజేశ్వర్‌రావు, కౌలు రైతు, శివాజీనగర్

ప్రత్యేక చట్టం తీసుకురావాలి



కౌలు రైతుల కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలి. వ్యవసాయ కూలీలే కౌలు రైతులుగా పంటలు సాగు చేస్తున్నారు. వారిని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడంతోపాటు ప్రభుత్వ బ్యాంకుల ద్వారా రుణాలిప్పించడంతోపాటు రైతుబీమా, రైతుభరోసా, ఇతర పథకాలు వర్తించేలా ప్రణాళిక అమలు చేయాలి. కేంద్ర, రాష్ట్ర పథకాలు అమలు చేస్తున్న పథకాలన్నీ కౌలు రైతులకు వర్తించేలా పటిష్ట కార్యాచరణ చేపట్టాలి.

– జరుపుల భాస్కర్, కౌలు రైతు, రేబల్లె

అంగడి రోడ్డుకు నిధులిచ్చేది లేదు

● గ్రామ సభలో ప్రజల స్పష్టీకరణ

గీసుకొండ : కొమ్మాల అంగడి రోడ్డు నిర్మాణానికి గ్రామ పంచాయతీ నుంచి నిధులిచ్చేది లేదంటూ పలువురు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన సభలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పాక శ్రీనివాస్, ప్రత్యేక అధికారి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శంకర్‌రావు, ప్రశాంత్‌లతో గ్రామానికి చెందిన గడ్డమీది కుమారస్వామి, కక్కెర్ల గణేశ్, రజనీకర్‌రెడ్డి, కుమారస్వామి, కేదారి, వేణు, ప్రసాద్, రమేశ్, కొండం కుమారస్వామి, తదితరులు వాగ్వాదానికి దిగారు. పరకాల ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుల మాట మేరకు తీర్మానం లేకుండానే పనులు చేయడానికి అనుమతులు ఇస్తున్నారంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామం వాటా కింద రూ.20 లక్షలు పంచాయతీ తీర్మానం లేకుండా కేటాయించడానికి అనుమతి ఇవ్వడం సరికాదన్నారు. సభను అడ్డుకున్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. రోడ్డు నిర్మాణం కోసం నిధులు ఇచ్చేది లేదని గ్రామస్తులు తీర్మానం చేయడంతో అధికారులు వెళ్లిపోయారు.



అధికారులను నిలదీస్తున్న కొమ్మాల గ్రామస్తులు

విశ్వనాథపురంలోనూ గొడవ

విశ్వనాథపురంలో సభ ఆలస్యం అవుతుండటంతో పలువురు కొంత సేపు వేచి చూసి వెళ్లిపోయారు. మధ్యాహ్నం 12.30 గంటలకు అధికారులు వచ్చి సభ నిర్వహణకు యత్నించగా దునికి కొమురయ్య, తిరుపతి, తదితరులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ నాయకులకు అనుకూలంగా సభ నిర్వహిస్తున్నారంటూ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే కోటా నుంచి రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

కృత్యాలతో బోధిస్తే ఉత్తమ ఫలితాలు

● ఎంఈఓ రత్నమాల

నెక్కొండ : కృత్యాలతో కూడిన విద్యాబోధనతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఎంఈఓ రత్నమాల తెలిపారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన కృత్యమేళాను ఆమె ప్రారంభించి కృత్యాలను తిలకించారు. అనంతరం ఆమె మాట్లాడారు. కృత్యాలతో బోధిస్తే విద్యార్థులకు సులువుగా అర్థమవుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు ఆకర్షణీయంగా కృత్యాల తయారు చేయాలని చెప్పారు. తెలుగు విభాగంలో అమీన్‌పేట యూపీఎస్ ప్రథమ స్థానంలో నిలవగా రెడ్లవాడ, పెద్దకొర్పోలు పీఎస్‌లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఉత్తమ కృత్యాలను జిల్లా స్థాయికి ఎంపిక చేశామని ఎంఈఓ చెప్పారు.



కృత్యాలను తిలకిస్తున్న ఎంఈఓ, తదితరులు

న్యాయ నిర్ణేతలుగా రమేశ్, ఐలయ్య, వీరన్న, మమత వ్యవహరించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు రంగారావు, రవికుమార్, మీర్ ఇక్బాల్‌ఖాన్, సీఆర్పీలు సుమలత, లావణ్య, దేవేందర్, శ్రీనివాస్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

‘సఖి’ సేవలపై అవగాహన అవసరం

● లీగల్ కౌన్సిలర్ శోభారాణి

నర్సంపేట : సఖి కేంద్రంలో లభిస్తున్న సేవలపై సమాజంలోని ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని లీగల్ కౌన్సిలర్ శోభారాణి తెలిపారు. సఖి వన్ స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి జెడ్పీ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు గృహహింస, లైంగిక వేధింపులు, మహిళలు, పిల్లల అక్రమ రవాణా, అత్యాచారాలు, జీవన నైపుణ్యాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మహిళల రక్షణ, హక్కులు, చట్టపరమైన సదుపాయాలు, ప్రభుత్వం అందిస్తున్న సేవల గురించి వివరించారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో డయల్ 181 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు తేజావత్ జయ మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలోని సమస్యలు, ప్రభుత్వాలు కల్పిస్తున్న సదుపాయాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సఖి సెంటర్ కేస్ వర్కర్ ఎం.తిరుమల, ఉపాధ్యాయులు సునీత, శశిధర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శోభారాణి

నానో యూరియాతో బహుళ ప్రయోజనాలు

రాయపర్తి : నానో యూరియాతో బహుళ ప్రయోజనాలున్నాయని వ్యవసాయ విస్తరణాధికారులు ఉడుత సాయిప్రసాద్, మనస్విని తెలిపారు. ఏరువాక-సాగుబడి కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆరెగూడెంలో శనివారం నిర్వహించిన అవగాహనా సదస్సులో వారు మాట్లాడారు. మామూలు యూరియాకు బదులు నానో యూరియా వినియోగిస్తే సమయం ఆదా కావడంతోపాటు మొక్కకు 90 శాతం బలం చేకూరుతుందని తెలిపారు. రైతులు నానో యూరియా వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెండ్లి రజని సుధాకర్‌రెడ్డి, ఇఫ్కో ప్రతినిధి ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో డ్రెయినేజీ అస్తవ్యస్తం

● బీజేపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు సందీప్

నర్సంపేట : నర్సంపేటలో డ్రెయినేజీ అస్తవ్యస్తంగా తయారైందని బీజేపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు గూడూరు సందీప్ తెలిపారు. పట్టణంలో నెలకొన్ని పారిశుద్ధ్య, ఇతర సమస్యలు పరిష్కరించేలా పనులు చేపట్టాలని కోరుతూ ఆయన ఆధ్వర్యంలోని బృందం మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేసింది. అనంతరం సందీప్ మాట్లాడారు. పలు వార్డుల్లో మిషన్ భగీరథ పనులు అసంపూర్తిగా ఉన్నాయని చెప్పారు. పలు కూడళ్లలో స్వల్ప వర్షానికే డ్రెయినేజీలోని మురుగు నీరు, చెత్తాచెదారం రోడ్లపైకి చేరుతోందన్నారు. పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. వెంటనే పారిశుద్ధ్య పనులు రెగ్యులర్‌గా చేపట్టేలా ఆదేశించాలని, మురికి కాల్వలను శుభ్రం చేయించడంతోపాటు బ్లీచింగ్ చేయడం చల్లించి సీజనల్ వ్యాధుల నుంచి ప్రజలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ పాదిల్ల రాంచందర్, నాయకులు సాంబమూర్తి, కందికొండ శ్రీనివాస్, నాగరాజు, విజయ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

లేబర్ కోడ్‌లను ఉపసంహరించాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుమార్

గీసుకొండ : లేబర్ కోడ్‌లను ఉపసంహరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అరూరి కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన యూనియన్ సమన్వయ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికులు సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న చట్టాలను సవరించే పేరుతో కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్మికులను బానిసలుగా మార్చే కుట్ర చేసిందని విమర్శించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బందికి నెలకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాల్సి ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. ఇప్పటివరకు 8 గంటలుగా ఉన్న పని దినాన్ని 10 గంటలకు పెంచడం దుర్మార్గమన్నారు. అనంతరం యూనియన్ మండల సమన్వయ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తొగటి బ్రహ్మచారి, కో కన్వీనర్లుగా కొమ్ముల రాంబాబు, ఇప్ప శ్రీనివాస్, చినగారి రాణి, గోరుకంటి రమేశ్, సభ్యులుగా నమిండ్ల బాబు, కోట సంతోశ్, లక్క సాంబయ్య, శంకర్, మహేందర్, ఇసంపెల్లి వజ్ర ఎన్నికయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న కుమార్

అవార్డు



పర్వతగిరి : మండలంలోని విశ్వజెనిత్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎర్రబెల్లి హరికుమార్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని ఓ కన్వెన్షన్ హాలులో ఈడీయూ టెక్ ఎక్స్‌పో–2025, ట్రస్మా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హరికుమార్‌కు నిర్వాహకులు అవార్డు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి రమేశ్‌రావు, కోశాధికారి రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘పనుల జాతర’ సిగ్గుచేటు

● బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సూరయ్య

నెక్కొండ : యూరియా అందక రైతులు ఇబ్బంది పడుతుండగా పనుల జాతర పేరుతో అధికార పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం సిగ్గుచేటని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, నియోజకవర్గ సీనియర్ నాయకుడు కొమ్ము రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సుమారు నెల రోజులుగా రైతులు ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి రైతుల సమస్యలను ఎప్పుడైనా పట్టించుకున్నారా? అని ప్రశ్నించారు. పనుల జాతర కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి ప్రొటోకాల్ ఉల్లంఘించి పాల్గొన్నారని తెలిపారు. ఈ విషయమై కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ దొనికెన సారంగపాణి, నాయకులు గాదె భద్రయ్య, కట్కూరి నరేందర్‌రెడ్డి, ఈదునూరి యాకయ్య, బొల్లెబోయిన వీరస్వామి, దేవనబోయిన వీరభద్రయ్య, లింగ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సూరయ్య

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

● థౌసెండ్ పిల్లర్స్ లయన్స్ క్లబ్ చైర్మన్ వేణు

దుగ్గొండి : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని థౌసెండ్ పిల్లర్స్ లయన్స్ క్లబ్ చైర్మన్ పరికిపండ్ల వేణు ఆకాంక్షించారు. మండలంలోని నాచినపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆ క్లబ్ సభ్యుడు శానబోయిన రాజ్‌కుమార్ సమకూర్చి టై, బెల్టు, గుర్తింపు కార్డులను వేణు శనివారం పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే అర్హత కలిగిన ఉపాధ్యాయులున్నారని, మెరుగైన విద్యాబోధన అందుతోందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో పలు ప్రభుత్వ పాఠశాలలు నిరాదరణకు గురవుతున్నాయని తెలిపారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులపై ఉందన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం జ్యోతి లక్ష్మి క్లబ్ ప్రధాన కార్యదర్శి రాజగోపాల్, జోనల్ చైర్మన్ సోమయ్య, మాజీ సర్పంచ్ రాజు, విద్యా కమిటీ చైర్మన్ ఓరుగంటి కవిత, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో వేణు, తదితరులు

‘మాజీ ఎంపీపీపై వేటు తగదు’

గీసుకొండ : ఎంపీపీగా నాలుగేళ్లు పని చేసిన బీఆర్ఎస్ నాయకురాలు ముంత కళావతిపై వేటు వేయడం సరికాదని ఆ పార్టీ గ్రామ నాయకుడు కామని నర్సయ్య అన్నారు. మండలంలోని ఎలుకుర్తి హవేలీలో శనివారం నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో నర్సయ్య మాట్లాడారు. కళావతిపై అభియోగాలు లేకున్నా అవిశ్వాస తీర్మానం పెట్టారని చెప్పారు. ఇతర పార్టీ నుంచి వచ్చిన వీరగోని రాజ్‌కుమార్ సతీమణిని ఎలా ఎంపీపీ చేశారని ప్రశ్నించారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, సమన్వయ కమిటీ సభ్యులు జయపాల్‌రెడ్డి, ప్రకాశ్, ముంత రాజయ్య, కంబాల కోటి, గుర్రం రఘు తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్‌రావు

రాయపర్తి : గణపతి నవరాత్రుల సందర్భంగా మట్టి విగ్రహాలను వినియోగించి పర్యావరణాన్ని పరిరక్షించాలని పర్యావరణ ఉద్యమకారుడు, రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు రావుల భాస్కర్ రావు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ఇన్‌చార్జ్ హెచ్ఎం సునీత, ఇన్‌చార్జ్ ఎంఈఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో భాస్కర్‌రావు మాట్లాడారు. రసాయనిక, కృత్రిమ రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల చెరువులు, కుంటలు కలుషితమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉప్పలయ్య, రోజారాణి, గాదె ప్రవీణ్‌రెడ్డి, దేవేందర్, వీరభద్ర శర్మ, దేవేందర్, అల్లూరి సురేందర్, పీఈటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలి’

నల్లబెల్లి : ఆదివాసీ ప్రజలకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేసే దిశగా ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గొల్లపల్లిలో శనివారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదివాసీల హక్కులకు తూట్లు యథేచ్ఛగా పొడుస్తూ కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేలా తప్పుడు విధానాలు అవలంభిస్తోందని విమర్శించారు. ఈ క్రమంలోనే ఆదివాసీ ప్రాంతాల్లో ఆపరేషన్ కగార్ చేపట్టి పలువురు నక్సలైట్లను పొట్టన పెట్టుకుంటుందని తెలిపారు. అనంతరం ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ముద్రించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఐలయ్య, ఇట్టబోయిన రవి, కుమారస్వామి, సలుపాల రమేశ్, సాంబయ్య, రాజిరెడ్డి, రాంరెడ్డి, రవి, శివ, స్వరూప, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



గీసుకొండ : మండలంలోని గొర్రెకుంటకు చెందిన రాజు కుమారుడు, ధర్మారంలో శంకరయ్య, రిటైర్డ్ పోలీసు అధికారి సారయ్య, దూపకుంటలో అచ్చెమ్మ, లక్ష్మి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శనివారం పరామర్శించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమాల్లో కార్పొరేటర్ మనోహర్, బీఆర్ఎస్ నాయకులు సుంకరి శివ, గోలి రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.


బీఆర్ఎస్ నాయకుడికి..

సంగెం : మండలంలోని ఎల్గూర్ రంగంపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు జనగాం శ్రీనివాస్ కంటి ఆపరేషన్ చేయించుకోగా ఆయన్ను మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి కలిసి పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

నెక్కొండ : మండల కేంద్రానికి చెందిన మాలోతు హరిప్రకాశ్ కానిస్టేబుల్‌గా పని చేస్తూ ఇటీవల ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతి చెందగా బాధిత కుటుంబానికి 2010 బ్యాచ్ కానిస్టేబుళ్లు, హరిప్రకాశ్ మిత్రులు శనివారం లక్షా 15 వేల రూపాయల సాయం అందజేశారు. తొలుత హరిప్రకాశ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

జాతీయ అంతరిక్ష దినోత్సవం



విద్యార్థులు తయారు చేసిన చార్ట్‌లను ప్రదర్శిస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని బాలాజీ టెక్నో స్కూల్‌లో శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. భారతదేశం చంద్రయాన్-3 చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు తయారు చేసి చార్ట్‌లను ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ థర్డ్ ఆఫీసర్ రియా జుద్దీన్, ఉపాధ్యాయులు రమేశ్, విజయ్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.